క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన

రామకృష్ణాపూర్: ఇటీవల వరుసగా జరుగుతున్న సైబర్ నేరాలపై పట్టణ రెండో ఎస్సై శ్రీనివాస్ స్థానిక సూపర్‌బజార్ సెంటర్‌లో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్స్‌కు లింక్‌లు పంపి కొందరు సైబర్ మోసగాళ్లు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు కాజేస్తున్నారని ఇలాంటి వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నంబరుకు కాల్ చేయాలని పేర్కొన్నారు.

వాహనాల వేలం

చెన్నూర్: చెన్నూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 30న మధ్యాహ్నం 12 కార్యాలయం ఆవరణలో జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. వేలంలో నడిచే సామర్థ్యం కలిగిన 12వాహనాలు, స్క్రాప్ కింద 3వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

'పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి'

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల, నస్పూర్ మండల కేంద్రంలో నిబంధనలు పాటించకుండా నడిపిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈవో పోచయ్యకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయించటం, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

సింగరేణి రక్షణకు తీర్మానం చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: సింగరేణి సంస్థ రక్షణ కోసం అసెంబ్లీ తీర్మానం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వక ట్రస్ట్ హాల్‌లో వామపక్ష పార్టీల కార్మిక సామాజిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా రాష్ట్ర కార్యదర్శి సంకె రవి, దుర్గం రాంమూర్తి, దేవరాజ్, కామిల్ల జయరావ్, జాడి రవి, రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

తెగిన కల్వర్టు పరిశీలన



కల్వర్టుని పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమారం: మండలంలోని కాజిపల్లి - నెన్నెల మండలం కొత్తూరు మధ్య గల వాగుపై గల కల్వర్టు వర్షాలకు తెగిపోవడంతో శుక్రవారం ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. రెండు మండలాల ప్రజలకు రవాణా సదుపాయం కల్పించే కల్వర్టు తెగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని సత్వరమే మరమ్మతు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపీవో సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బహుజనులంతా ఐక్యంగా ఉద్యమించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఛత్రపతి సాహూ మహారాజ్ అందించిన రిజర్వేషన్ల రక్షణతో పాటు సమగ్ర సామాజిక న్యాయ సాధన కోసం బహుజనులందరూ ఐక్యంగా ఉద్యమించాలని సామాజిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. 122రిజర్వేషన్ల డే సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వక ట్రస్ట్ హాల్‌లో ఛత్రపతి సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పంట పాయే.. ఎరువులు మిగిలె



ఆరు రోజులుగా ప్రాణహిత ముంపులోనే పంటలు మునిగి ఉన్నాయి. మండల కేంద్రంలోని ఎంచపాయ రూట్‌లో దారులు లేక వర్షాకాలం ప్రారంభంలోనే పత్తి చేళ్ల వద్ద ఎత్తైన ప్రదేశాల్లో ఎరువుల బస్తాలు నిల్వ ఉంచుకున్నారు. కానీ ఆరు రోజులుగా వర్షాలతో ప్రాణహిత పోటెత్తి ప్రవహిస్తుండటంతో పత్తి పంట మొత్తం వరదపాలైంది. పంటలు వరదలోనే మునిగి ఉన్నాయి. దీంతో రైతులు పైరు వరదపాలైన తర్వాత ఎరువులు వాడుకునే పరిస్థితి లేకపోవడంతో, నిల్వ ఉంచిన ఎరువులను వరదలోనే బస్తాకు రూ.100చొప్పున జాలర్లకు చెల్లించి ఎరువు బస్తాలు ఇళ్లకు తీసుకొస్తున్నారు.

– వేమనపల్లి



ప్రమాదకరంగా ఉన్న స్తంభం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం వెళ్లే దారిలో గల విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి వంగి ఉంది. గాలి దుమారాల వల్ల స్తంభం విరిగి కిందపడి పోయే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తంభం కిందపడితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించి, కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ను 'సాక్షి' సంప్రదించగా శివాలయం వెళ్లే దారిలో స్తంభం వంగిన మాట వాస్తవం. పట్టణ ప్రగతిలో కొత్త స్తంభం మంజూరైంది. స్తంభం వేసేందుకు వెళ్తే కొంత మంది అక్కడ వద్దని నిరాకరించారు. కాలనీ వా సు లతో మాట్లాడి కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తాం.



స్తంభం విరగడంతో వేలాడుతున్న విద్యుత్ తీగలు

పడిపోయి రెండేళ్లయినా..

దండేపల్లి: మండలంలోని దండేపల్లి పారెస్టు ఎంట్రెన్సీ చెక్‌పోస్టు సమీపంలో పంట పొలంలో రెండేళ్ల క్రితం విద్యుత్ స్తంభం విరిగిపడింది. దీంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు కొనసాగుతుండటంతో, ట్రాక్టర్‌తో దున్నితే పంట పొలంలో విద్యుత్ తీగలు ట్రాక్టర్‌కు తగిలేలా ఉన్నాయి. అధికారులు పడిపోయిన విద్యుత్ స్తంభం చోట కొత్త స్తంభం వేయడంతో పాటు, వేలా డుతున్న తీగలు సరిచేయాలని కోరుతున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం

'రైతులను మోసగిస్తే చర్యలు'

తాండూర్: నాసిరకం ఎరువులు, విత్తనాలు అమ్ముతూ రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి గజానంద్ ఫర్టిలైజర్ దుకాణాదారులను హెచ్చరించారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను, బిల్ పుస్తకాలను, ఎరువులు, విత్తనాల స్టాకులను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, బిల్లు రసీదులు ఇవ్వకున్నా శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. గజానంద్ వెంట ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, సిబ్బంది తదితరులు ఉన్నారు.



స్టాక్ పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి గజానంద్, అధికారులు

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

రామకృష్ణాపూర్: వర్షాకాలం దృష్ట్యా ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పనులను సక్రమంగా చేపట్టాలని బీజేపీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమల మందు పిచికారీ చేపించాలని, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేపించాలని కోరారు. పట్టణంలో పశువులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని వీటిని నివారించాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, 11వ వార్డు కౌన్సిలర్ గడ్డం సంపత్, మాసు సత్యనారాయణ, ఈశ్వరాచారీ వైద్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాలి

తాండూర్: విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడి అనారోగ్యం పాలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూర్ మండల ప్రత్యేక అధికారి గజానంద్, ఎంపీడీవో శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మహాత్మాగాంధీ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు కళ్ల కలకతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న వెంటనే శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు పలు పాఠశాలలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్, కార్యదర్శులు ఉన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్):మండలంలోని నంనూర్ జ్యోతిభా పూలే సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల తరగతి గదుల్లో అల్ఫాసైఫర్‌మెత్రిన్ పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, హెచ్‌ఈవో రఘుపతి, బ్రీడింగ్ చెకర్ రాజు, ఆశ కార్యకర్త పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలి

లక్సెట్టిపేట: గ్రామాల్లో ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో ఎటువంటి చెత్త లేకుండా చూడాలని, ప్రతి వీధిలో డ్రెయినేజీ శుభ్రంగా ఉంచాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో శుక్రవారం డ్రై డేను పాటించారు. 13వార్డు గంగారాం నగర్ బస్తీలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పూల కుండీల్లో స్థిరంగా ఉన్న నీటిని తొలగించారు. పాత టైర్లలో, కుండలలో నిలిచి ఉన్న నీటిని పారబోయించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మురికి నీరు నిలిచి ఉన్న గుంగల్లో స్ప్రేయింగ్ చేయించి, బ్లీచింగ్ ఫౌడర్ చల్లించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కౌన్సిలర్ బండి ప్రభాకర్, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ వైకుంఠం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: తరగతి గదిని పరిశీలిస్తున్న డీపీవో

నస్పూర్: తమ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. పలు వార్డులలో శుక్రవారం నిర్వహించిన ఫ్రై డే.. డ్రైడే కార్యక్రమంలో చైర్మన్ సురిమిల్ల వేణుతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, పలువురు కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న అశోక్‌యాదవ్, తదితరులు

భీమారం: గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ మండలంలోని కాజిపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో రైతులకు రూ.72,659కోట్లు కేటాయించడంతోపాటు రైతుల రుణమాఫీ చేయడంతో తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాడి తిరుపతి, కొమ్ము సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్, కొత్తగూడల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య సందర్శించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ.. తరగతులతో పాటు మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పూర్తిగా అందాయా లేదా అని ఆరా తీశారు.

పేకాట స్థావరంపై దాడి

లక్సెట్టిపేట: పాతబస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న బిల్డింగ్ ఆవరణలో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై సతీష్ తెలిపారు.

ఘనంగా దారిమైసమ్మ తల్లి బోనాలు



బోనమెత్తుకున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్‌కాలనీ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన దారి మైసమ్మతల్లి బోనాల వేడుక కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి హాజరై బోనమెత్తారు. పట్టణ ప్రజలు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా మైసమ్మ తల్లి కాపాడాలని బోనాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: కాంటా చౌరస్తా వద్ద నుంచి బూడిదగడ్డ చౌరస్తా మీదుగా కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి వాహన దారులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో 'సాక్షి' దినపత్రికలో గురువారం వచ్చిన వార్తా కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. 'గుంతల రోడ్లు.. ప్రయాణికుల పాట్లు' అనే శీర్షికన వార్త ప్రచురితం కాగా మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ జక్కుల శ్వేత సానుకూలంగా స్పందించి స్వయంగా దగ్గరుండి రోడ్డు మరమ్మతులు చేయించారు. సిబ్బందితో గుంతల్లో డస్ట్ సిమెంట్ పోయించి పూడ్చి వేయించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, ఏఈ సందీప్, ఆర్‌ఐ ప్రవీణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డస్ట్ సిమెంట్‌తో గుంత పూడుస్తున్న సిబ్బంది

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

తాండూర్: మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో జూనియర్ కళాశాల విషయాన్ని చర్చించి వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కళాశాల మంజూరైనప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని, ప్రభుత్వ కళాశాల మంజూరు చేయడం వల్ల తాండూర్, భీమిని కన్నెపల్లి మండలాల్లో పదో తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజీ మహేందర్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వినోద్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వృద్ధ దంపతులకు చేయూత

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: మండలంలోని గంగారాం గ్రామంలోని దుబ్బగూడంకు చెందిన వృద్ధ దంపతులు చల్లూరి వీరమల్లు, లస్మక్కల గుడిసె వర్షాలకు కూలిపోయి తలదాచుకోవడానికి చోటు లేక, దిక్కుతోచని స్థితిలో బిక్కు బిక్కుమంటూ పందిరి కిందనే ఉండిపోయారు. వారి దీన స్థితిపై 'వర్షాలకు కూలిన గుడిసె' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి గంగారాం గ్రామ యువనాయకుడు జాడి రాజ్‌కుమార్ స్పందించారు. శుక్రవారం తన సొంత ఖర్చులతో బాధిత వృద్ధులకు ఆసరాగా నిలిచారు. రూ.30 వేల విలువ కలిగిన రేకులతో పాటు ఇంటి సామగ్రి అందించి అండగా నిలిచారు. అతడి సేవా గుణానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ఇంటి సామగ్రి అందజేస్తున్న యువనాయకుడు రాజ్‌కుమార్

కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమానికి కృషి

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏరియాలోని ఎస్‌అండ్‌పీసీ భద్రత విభాగంలో ఎఫ్‌ఎస్‌ఎం సెక్యూరిటీ సంస్థ ద్వారా పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు జీరో సాలరీ అకౌంట్ పాస్‌బుక్‌లను జీఎం అందజేశారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల, కుటుంబ సభ్యుల సంక్షేమంలో భాగంగా జీరో అకౌంట్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ బాజీసైదా, ఎస్‌ఓటు జీఎం గోపాల్ సింగ్, పర్సనల్ డీజీఎం అరవిందరావు, ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సీనియర్, జూనియర్ ఇన్స్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



పాస్‌బుక్‌లు అందజేస్తున్న జీఎం సంజీవరెడ్డి

వరదతో అప్రమత్తంగా ఉండాలి

వేమనపల్లి: ప్రాణహిత వరదతో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్‌కుమార్ సూచించారు. మండల అధికారులతో కలిసి శుక్రవారం ప్రాణహిత వరదతో ముంపునకు గురైన సుంపుటం అట్టలొర్రె వంతెన, ప్రధాన రహదారిని ఆయన పరిశీలించారు. రోడ్డు వద్ద ప్రమాదకరంగా వరద ప్రవహిస్తుండటంతో ప్రమాదసూచికలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ప్రైమరీ పాఠశాలను, నీల్వాయిలోని కేజీబీవీ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న మామడ ఒర్రె తాత్కాలిక రోడ్డును పరిశీలించారు. మండలంలోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, కేజీబీవీ ఎస్‌వో మయూరి, స్టాఫ్ నర్సు శ్రీవాణి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఉన్నారు.



రోడ్డు పరిశీలిస్తున్న ఉదయ్‌కుమార్

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

భీమారం: మండంలోని కాజిపల్లిలో ఐసీడీఎస్ ద్వారా నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల కు ప్రభుత్వం పిల్లలకు అందిస్తున్న పౌష్టికా హారం నాణ్యతను ఆయన పరిశీలించారు. చెడిపోయిన ఆహారాన్ని పిల్లలకు అందించొద్దని టీచర్‌ని ఆదేశించారు. రెండు సంత్సరాలు వయస్సు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఆదేశించారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

జన్నారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు తమ ఫోన్‌లను పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను గుర్తించి యాజమానులకు అప్పగించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

పాఠశాలల తనిఖీ

కాసిపేట: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముత్యంపల్లి, మోడల్‌స్కూల్‌లను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి గంగారాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థులకు అందించిన యూనిఫాంల వివరాలు తెలుసుకున్నారు. ముత్యంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేనందునా అధికారులను విచారించి, చర్యలు తీసుకోవాల్సిందిగా తెలిపారు.

ఎన్నిక

మంచిర్యాలక్రైం: పట్టణంలోని గోదావరి రోడ్డులో గల బీఎంఏ ఫంక్షన్ హాల్లో ఆటో డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ నాయకుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మురళీ అధ్యక్షతన ఆటో యూనియన్ పట్టణ నూతన కమిటీని ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్మీజవాన్‌కు సన్మానం

జన్నారం: కార్గిల్ విజయ్ దివస్ డే పురస్కరించుకుని శుక్రవారం జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో ఆర్మీ జవాన్ ఎస్‌కే మజహర్‌ను పాఠశాల యాజమాన్యం సన్మానించింది. అనంతరం ఆయనతో కలిసి మొక్కలు నాటారు.

'దళారులను అరికట్టాలని వినతి'

కాసిపేట: ఆదివాసీలను మోసగిస్తూ ఆర్థికంగా నష్టపరుస్తున్న దళారులను అరికట్టాలని కోరుతూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం దేవాపూర్ యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా విస్తరణ ఉపన్యాస కార్యక్రమం

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా విస్తరణ ఉపన్యాస కార్యక్రమాన్ని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంగ చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మపురి ఎస్‌ఎల్‌ఎస్ ప్రాచ్య సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ విద్వాన కొరిడే విశ్వనాథ శర్మ హాజరై ప్రసంగించారు.

నిబంధనలు పాటించాలి

నస్పూర్: ప్రతి వాహనదారుడు వాహనాలను నడిపేటప్పుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలో వాహనదారులు పాటించాల్సిన నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

హాస్టల్ భవనాన్ని నిర్మించాలి

కోటపల్లి: మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగి సరిపోవడంలేనందునా అన్ని సదుపాయాలతో నూతన వసతి గృహం నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు రామన్న ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందించి నూతన భవనానికి మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కందుల వెంకన్న, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి టూటౌన్ ఎస్సైగా కె.మహేందర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది బొకే అందజేసి స్వాగతం పలికారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న డి.రమేష్‌ను వీఆర్ రామగుండంకు బదిలీ చేయగా, రామకృష్ణాపూర్ ఎస్సై-2గా పని చేస్తున్న మహేందర్ బెల్లంపల్లి టూటౌన్‌కు బదిలీపై వచ్చారు.